క్లుప్తంగా

ప్రజా చైతన్యమే ప్రజానాట్యమండలి లక్ష్యం



లక్ష్మీపురం: సమాజంలో పెరిగిపోతున్న అజ్ఞానం తొలగిపోవాలంటే కళాకారులు ప్రజా చైతన్యానికి పాటుపడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ తెలిపారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మల్లయ్య లింగంభవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి సమావేశం చంద్ర నాయక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ప్రజానాట్యమండలి నాయకులు గని మాట్లాడుతూ దేశ సంస్కృతి సంప్రదాయాలను భిన్నత్వంలో ఏకత్వం అన్న విషయాలను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర నాయక్, చెన్నం పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కవులు కళాకారులను సంప్రదించి నూతన కళారూపాలు తయారుచేసి ప్రజలను చైతన్య పరచడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రజానాట్యమండలి నాయకులు రామకృష్ణ, ఆర్.పిచ్చయ్య మహంతి లక్ష్మణరావు, ఆరే రామారావు, వి.నాగరాజు, శివయ్య పాల్గొన్నారు.

24న మెగా జాబ్ మేళా



గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య- కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో ఈనెల 24న మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కార్యదర్శి కె.సూర్యనారాయణ తెలిపారు. సోమవారం కళాశాలలో జాబ్‌మేళాకు సంబంధించిన సమాచార పోస్టర్లను విద్యార్థులు, అధ్యాపకులతో కలసి ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ జాబ్ మేళాలో బహుళజాతి సంస్థలు, ఐటీ, ఆన్ ఐటీ, బ్యాంకింగ్ ఫైనాన్స్, ఫార్మసీ సంస్థలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి వై.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ అధికారి ఎ.శ్రీధర్ పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కలిసి పనిచేయాలి

నగరంపాలెం: సమాజంలో ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు కలిసి పనిచేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు యేల్చూరి వెంకటేశ్వర్లు అన్నారు. జిన్నాటవర్ కూడలి చాంబర్ బిల్డింగ్‌లో సోమవారం ఏఐటీయూసీ ప్రతినిధుల బృందం మర్యాద పూర్వకంగా కలిసింది. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగురి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ కార్మికులకు యాజమాన్యాలకు ఏ సమస్య తలెత్తినా పరస్పర ఒప్పందంతో పరిష్కరించుకునే సంప్రదాయం ఉందని అన్నారు. ఆ సాంప్రదాయాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. అనంతరం యేల్చూరి వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హమాలీ ముఠా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్న ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఆకీటి అరుణ్‌కుమార్, కోట మాల్యాద్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర గౌరవాధ్యక్షులు జి.సురేష్‌బాబు, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ఉపాధ్యక్షులు చల్లా మరియదాసు పాల్గొన్నారు.

కన్న స్కూల్లో ఉత్సాహంగా కిడ్స్ ఫెస్టివల్



గుంటూరు ఎడ్యుకేషన్: రైలుపేటలోని కన్న ఇంగ్లిష్ మీడియం హై స్కూల్లో సోమవారం కిడ్స్ ఫెస్టివల్-2025 పేరుతో పిల్లల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు జాతీయ నాయకుల వేషధారణతో ప్రదర్శించిన ప్రదర్శనలు, నాటికలు ఆలోచింపజేశాయి. సమాజంలోని ప్రతి ఒక్కరితో సోదర భావాన్ని కలిగి ఉండటంతో పాటు, జాతీయ స్ఫూర్తి, పెద్దలను, మహిళలను గౌరవించడం, అవినీతికి రహితంగా జీవించడం వంటి అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకాలు, మౌన ప్రదర్శనలు, స్కిట్స్, లఘు నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాలుగా విద్యా బోధనతో సమానంగా విద్యార్థుల జీవన ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన నైపుణ్యాలను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ అడ్వైజర్ రాజేశ్వరి దేవి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అరండల్‌పేట సీఐగా ఆరోగ్య రాజు

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని అరండల్‌పేట పోలీస్ స్టేషన్ సీఐగా ఆరోగ్యరాజు ఆదివారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. గుంటూరు రేంజ్ ఐజీ వద్ద పీఆర్ ఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ప్రభుత్వ స్థలాలపై వాలుతున్న

కబ్జా రాయుళ్లు

- సీలింగ్, నగరపాలక సంస్థ స్థలాలపై కన్ను
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- రూ.కోట్లాది రూపాయలకు భద్రత కరువు



ఆదిత్య నగర్ మూడో లైన్లో సీలింగ్ ల్యాండ్ లో జరుగుతున్న నిర్మాణం

నెహ్రూనగర్: కబ్జా రాయుళ్లు బరితెగించారు. ప్రభుత్వ స్థలాలపై కూటమి నాయకుల కన్నుపడింది. యథేచ్ఛగా పాగా వేస్తున్నారు. సీలింగ్, రిజర్వు స్థలాల్లో దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా నగరపాలక సంస్థ అధికారులు అటువైపు కన్నెత్తిచూడడం లేదు.

డాక్యుమెంట్ వేరే డి నంబర్‌తో..

గుంటూరు తూర్పు పరిధిలోని 54వ డివిజన్ రాజీవ్ గాంధీనగర్ పదో లైనులో డీ నంబర్ 387 సీ3 లో సుమారు 300 గజాల స్థలం ఉంది. ఈ ప్రాంతంలో కొంత భాగం సీలింగ్ ల్యాండ్ కింద ఉంది. అయితే ఆ స్థలంలో గత కొద్ది నెలలుగా నిర్మాణం చేపట్టారు. అయితే దీనిని అనుకునే 387 సీ5లో నాన్ సీలింగ్ ల్యాండ్ ఉంది. ఈ నంబర్‌తో డాక్యుమెంట్ సృష్టించి ఆ నంబర్‌తోనే సర్వే రిపోర్టు సంపాదించి 387 సీ3(సీలింగ్ స్థలంలో) స్థలంలో రెండు ఫోర్లు నిర్మాణం చేపట్టారు. గతంలో ఈ స్థలం పక్కనే ఉన్న మరొక సీలింగ్ ల్యాండ్‌కు నగరపాలక సంస్థ, భవన నిర్మాణానికి ప్లాన్ మంజూరు చేసింది. దీనిపై కూడా ఫిర్యాదులు రావడంతో ఆ ప్లాన్‌ను నగర పాలక సంస్థ రద్దు చేసింది. కాని ప్రస్తుతం ఆ నిర్మాణం యథేచ్ఛగా సాగుతోంది.

- ఆదిత్యనగర్ 3వ లైనులో కూడా సీలింగ్ ల్యాండ్‌లో నిర్మాణం జరుగుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.
- శివనాగరాజు కాలనీ మెయిన్‌రోడ్డులో మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల రోడ్డు ఉంది. ఓ భవన యాజమాని ఇటీవల భవన నిర్మాణం రోడ్డు మీదకు చేపట్టాడు.
- రెడ్డి పాలెం మెయిన్‌రోడ్డులో ఓ బిల్డింగ్ నిర్మాణం ప్లాన్‌కు విరుద్ధంగా చేపట్టడంపై స్వయంగా కమిషనర్ పులి శ్రీనివాసులు భవన నిర్మాణం ఆపేయాలని చెప్పినా పట్టణ ప్రణాళిక అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో సదరు భవనం నిర్మాణం సాగుతోంది.

పశ్చిమలో ఇలా..

- గుజ్జనగుండ్ల నుంచి పలకలూరు వెళ్లే మెయిన్ రోడ్డులో నగరపాలక సంస్థ రిజర్వు స్థలం సుమారు 480 గజాలు ఉంది. దానిపై కూటమి నేతల కన్ను పడింది. ఎలాగైన సదరు స్థలాన్ని కాజేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఇందులో భాగంగా దానికి చుట్టూ ఫెన్సింగ్ వేసి తమ స్థలం అనిపించుకునేందుకు పావులు కదుపుతున్నారు.



గుజ్జనగుండ్ల సెంటర్ వద్ద నగరపాలక సంస్థ ఖాళీ స్థలం



పలకలూరుకు వెళ్లే దారిలో లైబ్రరీ స్థలం

గ్రంథాలయ స్థలంపై కన్ను

పలకలూరు రోడ్డులో నగరపాలక సంస్థ లైబ్రరీ స్థలం ఉంది. దీనికి ఎదురుగా ఉన్న ఇంటి పన్నుతో రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రహరీ కట్టుకున్నారు. దీనిపై స్థానికులు అప్పటి కమిషనర్ నాగలక్ష్మి(ప్రస్తుత కలెక్టర్)కి ఫిర్యాదు చేయడంతో సదరు స్థలంలో గోడను తొలగించాలని ఆదేశించారు. దీనిపై అక్రమదారుడు జిల్లా కోర్టులను ఆశ్రయించారు. కోర్టులు ఆధారాలను పరిశీలించి సదరు స్థలం లైబ్రరీకే చెందుతుందని స్పష్టం చేశాయి.

> **పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం**
>
> సీలింగ్ ల్యాండ్‌లో జరుగుతున్న భవన నిర్మాణాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ స్థలాలకు సంబంధించి విచారణ చేస్తాం.
>
> – లక్ష్మణ స్వామి, టీపీఎస్, నగరపాలక సంస్థ

మే ఒకటి నుంచి భారతీయ విద్యాభవన్‌లో వేసవి శిక్షణ శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యా భవన్ ఆధ్వర్యంలో మే ఒకటి నుంచి నెల రోజులపాటు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి పి.రామచంద్రరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు వివిధ కళల్లో నైపుణ్యత అవసరమని, విద్యాసంవత్సరం పొడవునా నిరంతరం చదువు పేరుతో మానసిక ఒత్తిడికి గురైన విద్యార్థులకు లలిత కళలు, సంగీతం, భరతనాట్యం, కూచిపూడి నృత్యంతో పాటు వెస్ట్రన్ డాన్స్, చెస్, బాస్కెట్ బాల్ వంటి ఆటల పోటీలతో పాటు పెయింటింగ్, యోగా, వ్యాయామంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో శిక్షణ కల్పిస్తామని తెలిపారు. శిక్షణ శిబిరంలో ప్రముఖ సంగీత, నాట్య కళాకారులు, క్రీడా నిపుణులచే ఐదేళ్లు నిండిన బాల, బాలికలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా భారతీయ విద్యాభవన్ పాఠశాలతో పాటు 9124519444, 9908520110 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలి

మంత్రి డోలాకు ఉద్యోగుల వినతి



నెహ్రూనగర్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీనియర్ ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ నియమించాలని సచివాలయ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ విన్నవించారు. ఈ మేరకు సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి పార్థా మధు పాల్గొన్నారు.

దుర్గాబాయి దేశముఖ్ సొసైటీ కార్యవర్గం



ఉమాదేవి



రూప్సీలక్ష్మి



సూయజ్



కృష్ణకుమారి

గుంటూరులీగల్: దుర్గాబాయి దేశ్‌ముఖ్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ దుర్గాబాయి దేశముఖ్ మహిళాసభ (ఏఎంఎస్) హైదరాబాద్ కేంద్ర కార్యాలయం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. అధ్యక్షురాలిగా ఎనగంటి ఉమాదేవి, ఉపాధ్యక్షురాలుగా రావూరి సూయాజ్, సోమసాని రూప్సీలక్ష్మి, కార్యదర్శిగా కొండ కృష్ణ కుమారి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్థాపించిన ఈ ఆంధ్ర మహిళాసభ ఆశయాలకు అనుగుణంగా మహిళల అభివృద్ధి కొరకు వివిధ కార్యక్రమాలను తమ పరిపాలన సంఘం చేపట్టి వారి అభ్యున్నతికి కృషి చేస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

వ్యవసాయంపై ఆంక్షలు ఎత్తివేయాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి, ప్రజా సంఘాల నాయకులు

> రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్

లక్ష్మీపురం: భారత వ్యతిరేక ట్రంప్ విధానాలను రద్దు చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ డిమాండ్ చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్ పర్యటనను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలలయం మల్లయ్య లింగం భవన్ వద్ద నుంచి భగత్‌సింగ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారీఫ్‌ల వల్ల భారత ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య, నల్లమడ రైతుసంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి, ప్రజానాట్య మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రనాయక్, పెంచలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): నూతన విద్యుత్ లైన్ల నిర్మాణ నిమిత్తం డీ-2 సెక్షన్ పరిధిలో మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీ-2 ఏఈఈ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. నల్లచెరువు పరిధిలోని చాకలికుంట, లాంఛస్టర్ రోడ్, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి గుడి లైను, ఆర్-అగ్రహారం, బైపాస్, మూడు బొమ్మలు సెంటర్, నల్ల చెరువు, ఏటుకూరు రోడ్, ఏటుకూరు తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అలాగే డీ-13 సెక్షన్(ఆర్‌టీసీ కాలనీ)లో 33/11 కేవీ కృష్ణ ఎస్ఎస్ నుంచి వచ్చే 11 కేవీ వాసవి ఫీడర్స్ మీద మెయింటెనెన్స్, చెట్ల తొలగింపు చర్యలు చేపడుతున్న దృష్ట్యా విజయవాడ రోడ్ తూర్పు సైడు, కబర్డినగర్, ఆర్చి రోడ్, నవభారత్ నగర్, రాఘవనగర్, ఇజ్రాయిల్‌పేట తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీహెచ్ ఖాన్ మరొక ప్రకటనలో తెలిపారు.

విద్యతోనే మానవ వికాసం

> జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ



మాట్లాడుతున్న డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు ఎడ్యుకేషన్: మనిషిని అజ్ఞానం నుంచి విజ్ఞానం వైపు నడిపించే విద్య ప్రపంచ చరిత్ర గతిని మార్చి వేస్తోందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి పేర్కొన్నారు. బాలానంద కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రాడీపేట, కృష్ణనగర్ లోటస్ ఆద్య పాఠశాలల వార్షికోత్సవాన్ని 'ఆద్యాస్ కార్నివాల్' పేరుతో సోమవారం కృష్ణనగర్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకుని ఏకాగ్రత, కఠోరశ్రమతో సాధించుకోవాలని కోరారు. విద్యార్థుల్లోని శాస్త్రీయ ఆలోచనలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని సూచించారు. విద్యా బోధనతోపాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి మానవీయ విలువలు, కంప్యూటర్, క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో ప్రోత్సహించాలని సూచించారు. బాలానంద కేంద్ర పాలకమండలి అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఏడు దశాబ్దాల నుంచి బాలానంద కేంద్రాల ద్వారా వేలాది మందిని క్రమశిక్షణగల పౌరులుగా తీర్చిదిద్దినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ అంశాల్లో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు అతిథులు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి నడింపల్లి వెంకట గురుదత్, సహాయ కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబ రావు, కరస్పాండెంట్ పరుచూరి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ యడ్లపల్లి ఉమాదేవి, కేతరాజు రామ్ సుభాష్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే పొదుపు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న సయ్యద్ జవహర్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే పొదుపు అలవర్చుకోవాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సయ్యద్ జవహర్ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు పొదుపు పాటించడంలో సేవింగ్ బ్యాంక్ ఖాతా ప్రాముఖ్యతపై బ్యాంకు అధికారులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జవహర్ మాట్లాడుతూ ఏడో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సేవింగ్స్ అవగాహన, ఆర్థిక సాక్షరతపై యూనియన్ బ్యాంక్ అధికారులు ఇంటరాక్టివ్ భాగంగా విద్యార్థుల్లో పొదుపు అలవాట్లను పెంపొందించేందుకు సేవింగ్స్ ఖాతా ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల పాలక వర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు మాట్లాడారు. పాఠశాల పూర్వ విద్యార్థి సయ్యద్ జవహర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ వెంకట దుర్గాప్రసాద్, సీనియర్ మేనేజర్ హారిక బొమ్మెన, మార్కెటింగ్ ఆఫీసర్ బిస్వజిత్ పాండా, పాఠశాల అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతి దేవి, సీనియర్ కోఆర్డినేటర్ దుర్గాశ్యామ్, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ శ్రీదేవి పాల్గొన్నారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డెప్యూటీ కమిషనర్లు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సకాలంలో పరిష్కరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 15 ఫిర్యాదులు అందుకున్నారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం నగర పాలక సంస్థ జనన, మరణ విభాగం వద్ద డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్ హాజరై ప్రజల నుంచి 37 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 18, ఇంజినీరింగ్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 5, ఉపా సెల్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అందిన అర్జీలను విభాగాల వారిగా విభజించి, సంబంధిత విభాగాధిపతులకి పంపి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ రామారావు, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

రోజువారీ వేతనంపై పారిశుద్ధ్య కార్మికులు

నెహ్రూనగర్: నగరంలో రోజువారీ వేతనంపై పనిచేసేందుకు పారిశుద్ధ్య కార్మికులు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాల్ సెంటర్‌లో నేరుగా లేదా 08632345103కి కాల్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టడం ద్వారా నగరాన్ని స్వచ్ఛ గుంటూరుగా తీర్చి దిద్దుకోవాడానికి ప్రస్తుతం ఉన్న కార్మికులకు అదనంగా కార్మికులు అవసరమని చెప్పారు. రోజువారీ వేతనంపై కేటాయించిన ప్రాంతాల్లో కేటాయించిన పారిశుద్ధ్య పనులు చేయడానికి ఆసక్తి ఉన్నవారు వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

అందరికీ ఆమోదయోగ్యంగా ఆర్వోబీ నిర్మాణం

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- నష్టపరిహారం చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే గల్లా

నెహ్రూనగర్: గుంటూరులో శంకర్ విలాస్ వద్ద ఆర్వోబీని అందరికీ ఆమోదయోగ్యంగా అతి తక్కువ కాలంలోనే నిర్మాణం చేపడతామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ ప్రభావిత భవనాల యజమానులకు పరిహారం అందించారు.

ఆర్వోబీ నిర్మాణ ప్రభావిత భవనాల యజమానులలో తొలుత సమ్మతి తెలిపిన 21 మందికి సంబంధించిన నిర్మాణాల నష్టపరిహారం నిమిత్తం రూ.71లక్షల చెక్కులను అందజేశారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణంపై కొంత మంది కావాలని అపోహలు సృష్టిస్తున్నారని, రహదారి విస్తరణ కోసం అక్కడ జీవనోపాధి పొందుతున్న వారికి కొంత ఇబ్బంది జరుగుతుందని కానీ విశాల దృక్పథంతో అర్థం చేసుకొని స్థలాలు ఇవ్వటానికి స్వయంగా సమ్మతించిన వచ్చిన భవన యజమానులకు కూటమి ప్రభుత్వం తరపున అభినందనలు తెలిపారు. 70 ఏళ్ళ క్రితం నిర్మించిన బ్రిడ్జి కావటం వలన ప్రస్తుతం అక్కడ ఆర్‌యూబీ కట్టడానికి సాంకేతికంగా సాధ్యం కాదన్నారు. అయితే అక్కడ కొంత మంది అభ్యంతరాలపై అధికారులతో నాలుగు సార్లు సమావేశం నిర్వహించి, అన్ని సమస్యలకు పరిష్కారం చూపటం జరిగిందన్నారు. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుతం నిర్మిస్తున్న ఆర్వోబీ వద్ద అవసరమైతే భవిష్యత్‌లో ఆర్‌యూ బీ నిర్మించేలా డిజైన్ చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, రాష్ట్ర ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకరరావుతో కలసి పాల్గొన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ స్థలాలకు టీడీఆర్ బాండ్లు 45 రోజుల్లో అందించేలా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

నగరంలో మెరుగైన పారిశుద్ధ్య పనులు

నగరపాలక సంస్థ పరిధిలో మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టేలా కృషి చేస్తున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రజారోగ్య విభాగానికి అవసరమైన సారు ట్రాక్టర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల, శాసన సభ్యులు నసీర్ అహ్మద్, గల్లా మాధవి హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ ఆయా డివిజన్లలో చెత్త సేకరణ చేయడానికి వీలుగా ప్రస్తుతం ఉన్న 27 ట్రాక్టర్లకు తోడుగా మరో 6 ట్రాక్టర్లను కొనుగోలు చేసి ప్రజారోగ్య విభాగానికి అందించినట్లు చెప్పారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలి



గుంటూరు మెడికల్: ఏప్రిల్ 21 వచ్చిన కాంట్రాక్టు ఉద్యోగులకు ఇంత వరకు వేతనాలు ఇవ్వలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ బాషా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 1న కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో పాటు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు విజయబాబు, ప్రసాదరావు, నగర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదరత్తయ్య, కోశాధికారి శ్రీనివాస్, నగరశాఖ ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, జాన్, తాడికొండ తాలూకా యూనిట్ అధ్యక్షుడు సుబ్బారావు పాల్గొన్నారు.